వచ్చింది. కారుదిగగానే ఎదురుగా నిలబడివున్న వివవరాలైన ముసలామెని చూసి మొహం చిట్లించింది.

ఆమె దైన్యంనిండిన కళ్ళతో, ముహంలో ఇంత ఆశను పులుకొని మధిరవేపుచూసింది.

"ఏం! అప్పుడే తగలబడ్డావ్. మొన్ననేగా యాభై తీసుకు పోయావ్" చిరాకుగా అడిగింది.

"యాభై తీసుకొని రెండునెల్లు పైనేఅయ్యిందమ్మా. వారం నుండి తిండి లేక ఆకలితో అలమటించి పోతున్నా. కొంచెం కనికరించి దయచూపమ్మా" దీనంగా వేడ్కొంది.

పర్సులోంచి ఓ వంద తీసి ఆ ముసలిగాని మొహాన కొట్టి "ఇప్పట్లో కన్పించమాకు ఎవరైనా చూస్తే నాకు తలవంపు" కసురుకొని విసవిసా లోనికి వెళ్ళిపోయింది.

తిట్టినా, కసిరినా, తనకింత సహాయం చేసిన కూతురివేపు అభిమానంగా చూసి ఊరి చివరనున్న తన గుడిసెవేపు సాగిపోయింది వంటరి అయిన, ఓ అగ్రనటికి జన్మనిచ్చిన తల్లి. •

**—ఈతకోట సుబ్బారావు**

---

# 'రాక్షసుడు'

నక్క ఊళపెడ్తున్నట్టుగా విని పిస్తోంది ఫ్యాక్టరీ సైరన్....!

గేటుదాటి వెలుపలికి వస్తున్న కార్మికులకు యెదురుగా, పడమటివైపు పెద్దసైజు మాంసపు ముద్దలా కనిపిస్తున్నాడు అస్తమిస్తున్న యెర్రటి సూర్యుడు!

బయటకు వస్తున్న వందలాది కార్మికులతో పాటు ప్రకాష్ చకచకా అడుగులు వేస్తున్నాడు. సూపర్‌వైజరుగా పనిచేస్తున్న అతను ఆ రోజు తను తీసుకున్న జీతాన్ని ఏ విధంగా వెచ్చించాలో తనెంత చురుగ్గా నడుస్తున్నాడో అంత చురుగ్గాను ఆలోచిస్తున్నాడు.

అతని పదహారేళ్ళ వైవాహిక జీవితానికి మధురస్మృతి చిహ్నం కరుణ పదేళ్ళ వయసున్న ఒక్కగానొక్క కూతురు.

ఆమెకి వయసొచ్చేనాటికి తన శక్తిమేరకు డబ్బు సమకూర్చుకుని యేదోచిన్న వుద్యోగం చేసుకునేవాడికిచ్చి పెళ్ళి చెయ్యాలని ప్రకాష్ తాపత్రయం.

ఆలోచనలతో యిల్లుచేరుకున్న ప్రకాష్ తలుపులు తట్టాడు.

"హేమా .... హేమా !" మృదువుగా పిలిచాడు.

యెంత పిలిచినా సమాధానం రాకపోయేసరికి గుమ్మానికి యెదాపెడావున్న కిటికీ తలుపులు నెట్టి చూసాడు. అవి కూడా లోపల గడియపెట్టి ఉండటంతో యేదో తెలియని అనుమానం, భయం, ఆరాటం గుండెవేగాన్ని పెంచాయి.

తలుపుకున్న తాళం బెజ్జంలోంచి ఒంటి కన్నుతో లోపలికచూసాడు. లోపలంతా చీకటి.. కాని....యేదో వాసన ముక్కురంధ్రాలకు సోకగానే మనసు కీడు శంకించింది వాతావరణం చలిగావున్నా ముచ్చెమటలు పట్టాయి.

"హేమా .... బిగ్గరగా అరిచాడు. ఒక్క పరుగుతో యింటి వెనక్కివెళ్ళి పిట్టగోడదూకి లోనికి వెళ్ళాడు.

• • • •

వంటిపై బట్టలేకుండా కాలి బొబ్బలెక్కి వికృతంగావున్న హేమ మృత్యువుకు అతిసమీపంలో వుంది.

అనుకోని ఆ సంఘటనకు యేం ముంచుకొస్తుందోనన్న భయంతో, హేమను చేరబోతున్న ప్రకాష్ స్థాణువులా నిలబడిపోయాడు. వచ్చిన అందరూ అతనివైపు కొరకొరా చూసారు. వారి చూపుల్ని తట్టుకోలేక యేదో చెప్పాలను కొని నోరుతెరిచినా తడారిపోయి మాట పెగిలి రాలేదు.

వెనకనే యస్.ఐ, పోలీసుకానిస్టబుల్స్ వచ్చారు.

"వాడే....వాడే .... కిరసనాయిలుపోసి నా కూతుర్ని చంపాడు. కట్నం తేలేదని రోజూ వేధించేవాడట నా చిట్టితల్లిని. పదారేళ్ళ నుంచి ఈ నరకం అనుభవిస్తూనే యీ దుర్మార్గునితో కాపరం చేసింది నిన్న వుదయమే మా యింటికి వచ్చింది. కట్నం యివ్వలేదని రోజూ కొడ్తున్నాడంటూ, యిక తనా దెబ్బలు భరించలేనని నిన్నంతా యేడుస్తూనేవుంది. త్వరలోనే యేదో విధంగా డబ్బు సర్దుతామని నచ్చచెప్పి పంపినా యీ రాక్షసుడు నా కూతుర్ని పొట్టనపెట్టుకున్నాడు" అత్తామామలు రోదిస్తూ పోలీసులకు యిచ్చిన రిపోర్టు సమగ్ర సారాంశమది.

అప్పటికే హేమ రెప్పవేయటంలేదు. యెగశ్వాసతోచివరిదశలోవున్న హేమ మరణవాంగ్మూలంగా చెప్పిన ఒక్కమాటా ప్రకాష్‌కి వ్యతిరేకంగా ధ్వనించింది?!

"సా....ర్.. మా..వా. రు....... నా.... చావుకి కా...." అస్తవ్యస్తంగా, అసంపూర్తిగా పలికిన పలుకుల్లో ఒక విధమైన భయం,కంగారు ధ్వనించాయి.

• • • •

"అంత దారుణంగా అమ్మనెలా చంపగలిగావు నాన్నా?" ఎక్కిళ్ళమధ్య అడిగింది కరుణ తండ్రిని.

రిమాండులోవున్న అతని ఘనీభవించిన హృదయం మంచుకరిగినట్టు కరిగి కళ్ళవెంట ధారాపాతంగా వర్షించాయి.

"అంత మాటనకు తల్లీ'.... పాపభీతిలేని యీ లోకం, సత్యం....ధర్మం.... న్యాయం.... పూర్తిగా అడుగంటిన యీ లోకం నన్నేమన్నా బాధలేదు. న్యాయదేవత కళ్ళకి, చెవులకి నల్లపర్దకట్టి సత్యం..ధర్మం.. న్యాయాలకి నల్లటి ముసుగువేసిన యీనాటి న్యాయవ్యవస్థ నన్ను హంతకునిగా ముద్రవేసి వురిశిక్ష వేసినా సంతోషంగా అనుభవిస్తాను. పైలోకంలో నా కోసం ఎదురుచూసే నా హేమను చేరుకుంటాను. కాని.. కాని.... నువ్వు పసిదానివి దైవంతో సమానం!!.... అందుకే యెవ్వరిముందూ నోరువిప్పని నేను నీకు చెబుతున్నాను....!

కట్నం గురించి కాని, అన్యాయంగా వచ్చిపడే యితరుల ఆస్తులకోసం కానీ నేనేనాడూ ఆశించలేదు. ఆ విషయం మీ అమ్మకూ తెలుసు! ఒకసారి యేమందో తెలుసా? ...."

శూన్యంలోకి చూస్తూ చెప్తున్న అతని కళ్ళలో నీళ్ళు సుడులుగా తిరుగుతున్నాయి....

"యేమండీ.... మీరెంత అమాయకులండీ?! మనకున్నది ఆడపిల్ల, యీ రోజు మీరు కట్నం తీసుకోలేదని రేపు మన అమ్మాయిని కట్నం లేకుండా పెళ్ళిచేసుకోవటానికి యెవరన్నా వస్తారా? .... అందుకే.... దానికోసమే.. దేవుడిలాంటి మిమ్మల్ని కట్నంకోసం వేధించే రాక్షసుడిగా చిత్రించి అమ్మానాన్నలకు అబద్ధం చెబుతున్నాను.... యీ విషయంలో మీరేం మాట్లాడవద్దని గోముగా చెప్తూ నన్ను బుజ్జగించేది. పైగా వాళ్ళుగనక కట్నం యివ్వకపోతే నాకు మళ్ళీ పెళ్ళిచేస్తానని ఫక్కున నవ్వేది...."?"

జ్ఞాపకాలు తలుచుకుంటూ ఆ చిన్ని న్యాయదేవత 'కరుణ'కు చెబుతూనేవున్నాడు ప్రకాశ్.

**—వి. భాస్కరరావు**

---

### ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

*"ఈ గ్లాసులోని పాలను మూడు భాగాలుచేసి ఒకదాంట్లో మాత్రమే అదిగో ఆ పొట్లంలోని విషాన్ని కలిపి నాకివ్వండి" చెప్పాడు వీరేంద్ర తన ఇద్దరి స్నేహితులతో.*